క్లుప్తంగా

17న 52వ అమావాస్య హోమం



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిన బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహ మూర్తి మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శ్రీఘ్రముగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 17న దేవాలయంలో 52వ అమావాస్య హోమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొని పూజలు చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత



రేపల్లె: ఇటీవల పట్టణంలోని 3వ వార్డులో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మందా సత్యనారాయణమూర్తి కుటుంబానికి రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ మంగళవారం చేయూతనిచ్చింది. వంట పాత్రల సెట్, టార్పాలిన్ షీట్, బ్రెడ్లు, బిస్కెట్లు, డ్రింక్స్, వాటర్ బాటిళ్లను అందజేశారు. రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్, రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య, కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, సభ్యులు అడుసుమల్లి ప్రభాకర్, సయ్యద్ కరిముల్లా, రక్తనిధి కేంద్రం కార్యకర్తలు వాడపల్లి వాణి, కారుమూరు లక్ష్మణ్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు చేస్తూ కూలీ మృతి



చెరుకుపల్లి: ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ కూలీ మృతి చెందిన ఘటన ఆరుంబాక గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఆరుంబాక ఎస్సీ కాలనీకి చెందిన వేము సాగర్‌బాబు (65) గ్రామ పరిధిలోని పులిగడ్డవారి పాలెం - కామినేనివారి పాలెం గ్రామాల నడుమ డ్రెయినేజీ పనులు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది సాగర్‌బాబును పరీక్షించి, మృతి చెందినట్లు చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశం



రేపల్లె రూరల్: పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పాల్గొని, పలు అంశాలను పార్టీ కార్యకర్తలతో సమీక్షించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పంతాని మురళీధరరావు, జీపీ రామారావు, జీవీ నాగేశ్వరరావు, విహారపు వీరయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ



పిట్టలవానిపాలెం: ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ అల్లూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజలను గౌరవించాలని, వెంటనే పనులను చేసి పంపించాలని సిబ్బందికి సూచించారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ పద్మజ, గ్రామ కార్యదర్శి శివకుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

లబ్ధిదారులతో చర్చించండి..గృహ నిర్మాణాలు చేపట్టండి

రేపల్లె ఆర్డీవో జగన్నాథం పార్థసారథి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి, తహసీల్దారు, ఎంపీడీఓ

ఐలవరం(భట్టిప్రోలు): వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టే విధంగా లబ్ధిదారులతో చర్చించాలని రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అధికారులను ఆదేశించారు. ఐలవరంలోని జగనన్న కాలనీని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలో 210 మందికి ఇళ్ల పట్టాలు ఇస్తే 120 మందికి పైగా గృహాలు నిర్మించుకోకపోవడానికి గల కారణాలను తెలుసుకోవాలని సూచించారు.గృహాలు నిర్మించుకోకపోతే తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దారు ఎంఎల్ శ్రావణ్ కుమార్‌కు దిశానిర్దేశం చేశారు. గృహం అవసరం లేని వారికి స్థల పట్టాను తొలగించి, అర్హులకు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. మరోసారి లేఅవుట్ సందర్శనకు వచ్చేసరికి గృహాల నిర్మాణం ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, హౌసింగ్, పంచాయతీ రాజ్ ఏఈలు రావూరి సౌమ్య, శేతు రామచంద్రరావు, వీఆర్వోలు రత్నాకర్, పి.లీలాగ్రేసమ్మ, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నాదుల శరత్, గట్టు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: నిజాంపట్నం, నగరం మండలాల్లో మూడు రోజుల నుంచి విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యతో అసౌకర్యానికి గురవుతున్నట్లు ఆయా మండలాలకు చెందిన గ్రామస్తులు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావుకు విన్నవించారు. పట్టణంలోని ఎంపీ వ్యక్తిగత కార్యాలయంలో మంగళవారం కలిసి సమస్యలను వివరించారు. లో ఓల్టేజ్ సమస్యను సంబంధిత అధికారులకు పలుమార్లు వివరించినా.. స్పందించలేదని తెలిపారు. దీంతో స్పందించిన ఎంపీ మోపిదేవి విద్యుత్ శాఖ డీఈతో ఫోన్‌లో మాట్లాడారు. లో ఓల్టేజ్‌కు గల కారణాలను తెలుసుకుని, సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంపీకి వివరించారు.

చిన్నారుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించాలి



తల్లులకు వివరిస్తున్న సూపర్‌వైజర్ ధనలక్ష్మి

చెరుకుపల్లి: చిన్నారుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించే దిశగా అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలని సెక్టార్ సూపర్ వైజర్ ధనలక్ష్మి సూచించారు. చెరుకుపల్లిలోని గొడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జన బాగీదారీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. పుస్తకాలతో పాటు ఆటవస్తువులతో చిన్నారుల మేధస్సును పెంపొందించే విధంగా బోధన విధానాలను రూపొందించటం జరిగిందన్నారు. చిన్నారులకు ఆట వస్తువులతో విద్యాబోధన విధానాలను తల్లులకు వివరించారు. చెరుకుపల్లి హెచ్‌ఈ పాఠశాల హెచ్‌ఎం కనకమహాలక్ష్మి, ఏఎస్ఎం ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.శైలజ, సీహెచ్ వెంకటేశ్వరమ్మ, నిర్మల, మల్లేశ్వరి, జి.లెనినా, లక్ష్మీతిరుపతమ్మ, నాగమణి, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

19న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు..

చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ కో–కన్వీనర్ జి.బాలాజీ



ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

చెరుకుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న కలెక్టరేట్‌ల ఎదుట తలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కో–కన్వీనర్లు కొట్టుముక్కల బాలాజీ, మురుగుడు సత్యనారాయణ, మచ్చివాడ వెంకట్రావ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలం కేంద్రంలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



డ్వాక్రా మహిళల ర్యాలీలో పాల్గొన్న అధికారులు

కర్లపాలెం: మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఈఓపీఆర్డీ అమర్తలూరి ఎలీషాబాబు పేర్కొన్నారు. కర్లపాలెం మండల సమాఖ్య ఆధ్వర్యంలో సంగతాన్‌సే సమృద్ధి కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్థికాభివృద్ధిపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలీషాబాబు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలతో ఆదాయం సమకూర్చుకోగలిగిన చిన్న చిన్న వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, సామాజిక భద్రత పెంపొందించుకోవాలని చెప్పారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ మురళి, యూనియన్ బ్యాంకు మేనేజర్ భగత్, హౌసింగ్ ఏఈ అన్వర్ భాషా, పశు వైద్యులు రేచల్ దివ్య, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సీసీలు పూర్ణచంద్రరావు, శివ కోటేశ్వరరావు, లక్ష్మీసోమేశ్వరి, వీవోఏలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీవీ సాంబశివరావు

కర్లపాలెం: అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, సేవా గుణం కలవారు ముందుకు రావాలని నల్లమోతు వారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర వెంకట సాంబశివరావు కోరారు. కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని కాటూరి చిన నారాయణ పూరిగుడిసె, వరిగడ్డి వామి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాండ్ర సాంబశివరావు, మాజీ సైనికులు బాధితుడు కాటూరి చిన నారాయణను పరామర్శించారు. రూ. 25వేల నగదు, వంట పాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు టి.దుర్గారావు, జె.జోసెఫ్, సయ్యద్ అఖిల్, కె.సుబ్బారావు తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు అగ్ని ప్రమాద బాధితునికి కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారి కుమారుడు నక్కా సంతోష్ కుమార్ రూ.10వేలు నగదు అందజేశారు. సంతోష్‌కుమార్ వెంట ఉప సర్పంచ్ అహ్మద్ బాషా, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఉన్నారు.

ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధాకృష్ణ, ఏడీ సూరిబాబు

బాపట్ల అర్బన్ : క్రెడిట్ ప్లాన్ అమలులో భాగంగా మండల సమాఖ్య కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఎంపీడీవో రాధాకృష్ణ మాట్లడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను ఉపయోగించుకొని ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇండస్ట్రీస్ డిపార్ట్ మెంట్ ఏడీ సూరిబాబు, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఎఫ్‌డీఓ రవీంద్ర, పశు సంవర్ధక శాఖ డాక్టర్ గోపికృష్ణ , వ్యవసాయ శాఖ నుంచి ఏఈఓ ప్రశాంతి తమ పరిధిలోని పథకాలను, రాయితీలను వివరించారు. ఏపీఎం సురేష్ మాట్లడుతూ వివిధ శాఖల పథకాల అమలుకు డీఆర్‌డీఏ నుంచి బ్యాంక్ రుణ సదుపాయం కల్పించి, యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం 6,201 లబ్ధిదారులకు రూ. 83.16 కోట్లతో యాక్షన్ ప్లాన్ తయారు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సీసీలు సుమలత, రత్నరాజు, ప్రసాద్, ప్రకాష్, గ్రామ సంఘ సహాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



పిట్టలవానిపాలెం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉందని, పిట్టువారిపాలెం గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏట్ర అశ్విని తెలిపారు. పిట్టువారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఆమె అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఏట్ర శ్రీనివాసరెడ్డి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ తుమ్మా నాంచారమ్మ, ప్రధానోపాధ్యాయులు పరిశ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో రేపల్లె పట్టణం ఓల్డ్ టౌన్‌లోని అరవపల్లి రహదారిలో బుధవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ బీమాతో ధీమా

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామానికి చెందిన గౌస్ షరీఫ్ అనే వ్యక్తి ఈ నెల 12న గుండెపోటుతో మృతి చెందడంతో.. వైఎస్సార్ బీమా కింద రూ.10వేలు నగదు చెక్కును మట్టి ఖర్చుల నిమిత్తం అతని కుటుంబానికి ఎంపీపీ షేక్ బాజీ మంగళవారం అందజేశారు. గ్రామ కార్యదర్శి శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మునీర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు సన్మానం



జంపని(వేమూరు): జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బద్రి నారాయణను జెడ్పీటీసీ గాజుల హేమలత, ఉపాధ్యాయులు మంగళవారం సన్మానించారు. ఇన్‌చార్జిగా చేసిన బద్రి నారాయణ స్థానంలో ప్రభుత్వం హెచ్‌ఎంగా పీఎస్ స్వామిని నియమించింది. దీంతో ఇప్పటి వరకు సేవలందించిన బద్రినారాయణను గ్రామ సర్పంచ్ చుండూరు పెద మరియమ్మ, ఎంఈఓ కాజా లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ షేక్ బాజీ, విద్యా కమిటీ చైర్మన్ అలీఖాన్ తదితరులు సన్మానించి, అభినందనలు తెలిపారు.

ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ట్రాలీ



కర్లపాలెం: వేగంగా వెళ్తున్న ట్రాలీ అదుపు తప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం నల్లమోతువారి పాలెం దగ్గర చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్లపాలెం నుంచి బాపట్ల వైపు జాతీయ రహదారిపై వెళ్తున్న ట్రక్ ఆటో వేగంగా అదుపు తప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో రోడ్డుపై ఎలాంటి వాహనాలు ఎదురుగా లేకపోవడంతో.. ప్రమాదం తప్పిందని తెలిపారు.

సంక్షేమ పథకాలు జీవనోపాధికి తోడ్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

భట్టిప్రోలు: సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చుకోవాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జీవనోపాధుల కన్వర్జెన్సీ సమావేశం ఇందిర క్రాంతి పథం ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, లైవ్‌స్టాక్ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గేదెలకు కూడా అందరూ బీమా చేయించుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, పశువైద్యులు రోషన్‌బేగ్, బి. లక్ష్మీ రంజిత, ఎస్‌బీఐ, యుబీఐ మేనేజర్లు కె. లింగారెడ్డి, బీఏ నాయుడు, సీసీలు డి.హనోకు, కె. రజని, అకౌంటెంట్ బి. శిరీష, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



కిట్ అందజేస్తున్న హరనాథబాబు

నిజాంపట్నం: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని ఎంపీ మోపిదేవి సోదరుడు మోపిదేవి హరనాథబాబు పేర్కొన్నారు. అడవుల దీవి జెడ్పీ హైస్కూల్లో జగనన్న విద్యా కానుక కిట్‌లను మంగళవారం ఆయన విద్యార్థులకు అందజేశారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలనే లక్ష్యంతో అన్ని వసతులను కల్పించడంతో పాటు పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్, దుస్తులు వంటివి ముఖ్యమంత్రి అందిస్తున్నారని చెప్పారు. హెచ్‌ఎం జ్యోత్స్న, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్య లక్ష్మి మదన్, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, సర్పంచ్ కౌంతి శ్రీనివాసరావు, ఎంఈఓ హరిబాబు, పాఠశాల కమిటీ చైర్మన్ యార్లగడ్డ రమేష్, వీరంకి ముక్తేశ్వరరావు, రైతుబాబు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం

పిట్టలవానిపాలెం: మహిళా సాధికారతకు సమాఖ్య సంఘాలు సహకరించాలని డీపీఎం యు.సుబ్బారావు కోరారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం సమాఖ్య సంఘాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా లాంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఒడి పథకం లబ్ధి, ఇంటి స్థల పట్టా కూడా మహిళలకే అందించినట్లు గుర్తు చేశారు. గ్రామైఖ్య సంఘాల్లో కూడా మహిళా సాధికారత కోసం చేయాల్సిన పనుల గురించి చర్చించాలన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీఎం సంతోష్ కుమార్, సీసీలు గాంధీ, శేషగిరిరావు, నాగవేణి, ఎంఎస్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, ఎంఎస్ సెక్రటరీ నాగలక్ష్మి గ్రామైఖ్య సంఘాల సభ్యులు ఉన్నారు.

మామను చాకుతో పొడిచిన అల్లుడు..

వేమూరు: మామను అల్లుడు చాకుతో పొడిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం ఘటన చోటుచేసుకోగా.. మంగళవారం కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం మేరకు.. పోతుమర్రు గ్రామానికి చెందిన గరిక పాములు కూతురు సుబ్బలక్ష్మి, అదే గ్రామానికి చెందిన పట్టా సాంబశివరావు భార్యాభర్తలు. గత ఆదివారం సాంబశివరావు మద్యం సేవించి, భార్యను కొట్టాడు. దీంతో సుబ్బలక్ష్మి వెళ్లి.. తల్లికి విషయం చెప్పి బాధపడింది. ఈ విషయమై ఆమె తన అల్లుడు సాంబశివరావును ప్రశ్నించగా.. వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గరిక పాములు చికెన్ స్టాల్ మూసి, ఇంటికి వచ్చిన తర్వాత అల్లుడు కూతురిని కొట్టి విషయాన్ని భార్య అతనికి చెప్పింది. దీంతో పాములు వెళ్లి.. సాంబశివరావును కర్రతో కొట్టాడు. కోపోద్రిక్తుడైన సాంబశివరావు తన దగ్గరున్న చాకుతో మామను పొడిచాడు. దీనిని గమనించిన బంధువులు వెంటనే 108 వాహనంలో పాములును తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్య కోసం ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. హాస్పిటల్ సిబ్బంది వివరాల మేరకు.. ఎస్ఐ చంద్ర శేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.4.79లక్షల జరిమానా



వివరాలు తెలియజేస్తున్న ఈఈ చిరంజీవి

తెనాలిటౌన్: పట్టణంలోని విద్యుత్ డి–3 సెక్షన్ పరిధిలో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవీఎల్ఎన్.మూర్తి ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి ఆధ్వర్యంలో అధికారులు 61 బృందాలుగా ఏర్పడి, పట్టణంలో తనిఖీలు చేశారు. అదనపు లోడు, అనధికార కనెక్షన్లు, మల్టిపుల్ సర్వీసులు తనిఖీ చేశారు. 4,593 సర్వీసులు తనిఖీ చేయగా అదనపులోడు వాడుతున్న 164 మందిని గుర్తించి వారికి జరిమానా కింద రూ.4,54,434 విధించినట్లు ఈఈ చిరంజీవి తెలిపారు. అధికార కనెక్షన్లకు రూ.25వేలు ఫైన్ విధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, అక్రమంగా విద్యుత్ వాడినట్లయితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

అరటి పంట దగ్ధం



కొల్లిపర: ప్రమాదవ శాత్తు అరటి పంట దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి మండలంలోని బొమ్మువానిపాలెంలో చోటుచేసుకుంది. ఘటనపై రైతులు తెలిపిన వివరాల మేరకు.. కొల్లిపర గ్రామానికి చెందిన బొంతు పున్నారెడ్డి, బొంతు వెంకటరెడ్డి అరటి తోటలు నిప్పు అంటుకుని దగ్ధమయ్యాయి. పున్నారెడ్డి తోట 30 సెంట్లు, వెంకటరెడ్డి తోట 35 సెంట్లలో అరటి పంట పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. గ్రామ సచివాలయం హార్టికల్చర్ అధికారి కోటిలక్ష్మి మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి, నివేదికను ఉన్నతాధికారులకు పంపారు.